క్లుప్తంగా

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



అలంపూర్: మండలంలోని లింగనవాయి గ్రామ రైతు కమిటీ సభ్యులు కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరామన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ల విడుదల



రాజోళి: హైదరాబాద్‌లో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన మండల ఫొటోగ్రాఫర్లు ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్ పవన్ శేఖర్ మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్లలోని నైపుణ్యాన్ని ఈ కార్యక్రమంలో ప్రదర్శిస్తారని, అలాంటి ఎగ్జిబిషన్ ద్వారా ఫొటోగ్రాఫర్లకు నూతన విషయాలు తెలియడంతో పాటు, ఫొటోలు తీయడంలో మెలకువల గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమంలో కాకే సుధాకర్, శిరీష్‌కుమార్, రాఘవేంద్ర, రాము, రాజు వీరేష్, అడివిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అలంపూర్: పేకాటరాయుళ్లపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. అలంపూర్ చౌరస్తాలోని ఉత్తర ఫుడ్స్ కంపెనీ వెనక భాగంలో ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేశామన్నారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు వెంకటేశ్వర్లు, చంద్ర, గార్లేయపురం భాస్కర్, బోయ వేణులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,640 నగదుతో పాటు నాలుగు సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు



అయిజ: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. నడిం మసీద్ నుంచి అంబేడ్కర్ చౌక్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. ప్రవక్త సర్వమానవాళికి శాంతి సందేశం ఇచ్చారని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మల్దకల్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందగా.. మరో ఐదు ఆవులు తృటిలో తప్పించుకున్న ఘటన ఆదివారం మండలంలోని పెద్దొడ్డి సమీపంలో చోటు చేసుకుంది. పెద్దొడ్డి గ్రామానికి చెందిన జయరాంగౌడ్ తన వ్యవసాయ పొలంలో ఆరు ఆవులను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే ఆదివారం ఆవులను మేతకు తీసుకెళ్లగా.. గ్రామ సమీపంలోని రాముడు వ్యవసాయ పొలం వద్ద ఆవులు మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రూ.70 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయారు. మిగిలిన ఆవులకు ప్రమాదం తప్పిందన్నారు. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరారు.

అపూర్వ సమ్మేళనం

అయిజ: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1998–99 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు ఉపాధ్యాయులకు వారు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా చదువుకుంటున్న రోజులను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



పారిశుద్ధ్య పనులు చేపట్టరా?

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురుగుతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మడ్డిగుంత కాలనీ, టీచర్స్ కాలనీ, గాజులపేట కాలనీ, భరత్‌నగర్ కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఆయా కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించిన కారణంగా మురుగునీరు ముందుకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతుంది. మురుగు నిలిచి ఉండడం వలన దోమల ఉధృతి ఎక్కువై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, త్వరితగతిన సీసీ రోడ్లు, ఇరువైపులా డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని పట్టణంలోని వివిధ కాలనీల ప్రజలు కోరుతున్నారు. అయితే పట్టణంలో అన్ని కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించేందుకు సుమారు రూ.20 కోట్ల నిధులు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం అయిజ మున్సిపాలిటీలో నిధులు కొరత తీవ్రంగా ఉంది.



భరత్‌నగర్‌లో నిలిచిన మురుగు

బ్రిడ్జిపై లైట్లు బిగించాలి



పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్యనున్న పెద్దవాగుపై కొత్తగా నిర్మించిన బ్రిడ్జిపై విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ చిమ్మ చీకట్లు కమ్ముకుంటాయి. వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు ఎదుటివారి కళ్లపై వెలుతురు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రజలు రాత్రి సమయంలో తిరిగేందుకు భయపడుతున్నారు. వెంటనే ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి.

– తిరుమలరెడ్డి, గుర్రంతోట కాలనీ

డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి



మడ్డిగుంత కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షం కురిస్తే నీళ్లు కాలనీలోని ఇళ్లలోకి వస్తోంది. మురుగునీరు కాలనీలో ఎల్లప్పుడు నిల్వ ఉండడం వలన దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ఉధృతి పెరిగి కాలనీ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి.

– వెంకటేష్, మడ్డిగుంత కాలనీ

సీసీ రోడ్లు నిర్మించాలి



పట్టణంలోని అనేక కాలనీల్లో ఇప్పటి వరకు సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో వర్షాకాలం రోడ్లు మురుగు గుంటలను తలపిస్తాయి. కనీసం కాలి నడకన వెళ్లాలన్న కూడా వీలులేకుండా పోతుంది. బైక్ అదుపు తప్పి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలి.

– బాషా, కోట్ల వీధి

నిధులు లేవు



ప్రస్తుతం మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేంద కు నిధులు లేవు. అన్ని కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించేందుకు సు మారు రూ.15 నుంచి 20 కోట్ల నిధులు అవసరం ఉంటుంది. అభి వృద్ధి పనులు చేపట్టేందుకు రూ.15 కోట్లకు ఎస్టిమేషన్ వేసి, సీడీ ఎంఏ కార్యాలయానికి పంపాం.అదేవిధంగా పెద్దవాగు బ్రిడ్జిపై, కొత్త బస్టాండ్‌లో మూడు ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు రూ .5 లక్షలకు అంచనా వేశాం. నిధులు విడుదలైన వెంటనే అభివృద్ధి పనులు చేపడుతాం.

– రాజశేఖర్, మున్సిపల్ ఏఈ, అయిజ

ప్రభుత్వ పాఠశాలలకు పురుగుల బియ్యం సరఫరా



అమరవాయి పాఠశాలకు సరఫరా చేసిన పురుగులు, మక్కిన బియ్యం



పురుగుల బియ్యాన్ని శుభ్రపరుస్తున్న వంట ఏజెన్సీ మహిళలు

మల్దకల్: మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు పాఠశాలలకు సరఫరా చేసే బియ్యంలో పురుగులు వస్తున్నాయని, మక్కిన బియ్యం అందిస్తున్నారని వంట ఏజెన్సీ మహిళలు తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు గద్వాల స్టాక్ పాయింట్ నుంచి ప్రతి నెలా బియ్యం సరఫరా అవుతుంది. ఈ క్రమంలో ఆగస్టు కోటాకు సంబంధించిన బియాన్ని పాఠశాలలకు సరఫరా చేయగా.. అందులో అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌కు పురుగులతో కూడిన 8 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేశారు. దీంతో వంట ఏజెన్సీ మహిళలు పురుగులు, మక్కిన బియ్యంతో తాము వంట ఎలా చేయాలని ఉపాధ్యాయులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతి రోజు అదే బియ్యాన్ని శుభ్రపరచి వంట చేస్తూ విద్యార్థులకు వడ్డిస్తున్నామన్నారు. ఈ బియ్యంతో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని తినడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతే అందుకు బాధ్యులు ఎవరని వంట ఏజెన్సీ మహిళలు పాఠశాల ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పురుగుల బియ్యంతో పాటు తమకు సక్రమంగా వంట బిల్లులు రాకపోవడంతో వంట చేయడం మానుకుంటామని ఏజెన్సీ వారు పద్మమ్మ, గోవర్ధనమ్మ, యాదగిరి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పురుగులు, మక్కిన బియ్యాన్ని తీసుకెళ్లి నాణ్యమైనవి ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయాలని వంట ఏజెన్సీ మహిళలు కోరుతున్నారు.

‘పేదలు ఏకమైతేనే అధికారం చేజిక్కుతుంది’



భీమ్ ఆర్మీ కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న మాచర్ల ప్రకాష్

గట్టు: పేదలు ఏకమైతేనే అధికారం చేజిక్కుతుందని, అప్పుడే పేదరికం నుంచి విముక్తి లభిస్తుందని భీమ్ ఆర్మీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మాచర్ల ప్రకాష్ అన్నారు. ఆదివారం గట్టులో భీమ్ ఆర్మీ మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గట్టు మండల భీమ్ ఆర్మీ అధ్యక్షుడిగా రాజు (సల్కాపురం), ఉపాధ్యక్షుడిగా వెంకటేష్ (రాయాపురం), ప్రధాన కార్యదర్శిగా యేసురాజు(తప్పెట్లమొర్సు), కార్యదర్శులుగా జస్టిన్, మేసు, వినీత్, స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా జమ్మిచేడు సురేష్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాచర్ల ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో భీమ్ ఆర్మీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భీమ్ ఆర్మీ పేదల సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. సంఘటిత శక్తిగా మారి నిమ్న వర్గాలను రాజకీయంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటును అమ్ముకోకుండా పేదల బతుకుల మార్పే వారికి పట్టంగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అలంపూర్ కోఆర్డినేటర్ పుట్ట ప్రసాద్, ఉపాధ్యక్షుడు మెకానిక్ జాన్, అయిజ ఇన్‌చార్జి కృపాకర్, నాయకులు మార్క్, జెకర్య, రాయపురం నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూమిని పేదలకు పంచాలి



సభలో మాట్లాడుతున్న విశారధన్

వనపర్తిటౌన్: తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాల్లో చుక్క నీటిని ఆంధ్రాకు తరలించేందుకు ఒప్పుకోనంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. భూస్వాములు అన్యాక్రాంతం చేసిన భూములు అర అంగులం కూడా ఉండనివ్వమని ఎందుకు ప్రకటించడం లేదని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డా.విశారదన్ ప్రశ్నించారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణకు రావాల్సిన నీటిని దక్కించుకోవడం మంచిదే అని.. మరి అన్యాక్రాంతంగా ఉన్న భూమిని పేదలకు పంచేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ప్రపంచంలో అధికారం ఏ ఒక్కరి చేతుల్లో లేదని.. తెలంగాణలో మాత్రమే ఇద్దరి కులాల నడుమ బందీ అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సమాజంలో వనరులు పరిమితంగా ఉంటుండగా.. ప్రజల అవసరాలు అపరిమితంగా ఉంటున్నాయన్నారు. ఈ రెండింటి మధ్య వారధి కట్టే రాజకీయాన్ని నిరుపేద ప్రజలు చేజిక్కించుకుంటేనే భవిష్యత్ పూలబాటగా మారుతుందని వివరించారు. బడుగు బలహీన వర్గాలు అతి మంచితనంతో రాజకీయాలకు దూరంగా ఉండటం సరికాదని.. రాజకీయ ఆకాంక్షలతో ముందుకు రావాలని అన్నారు. రూ. 12వేల కోట్ల ఆస్తులు, రూ. 6కోట్ల పార్టీ ఫండ్ ఉన్న బీఆర్‌ఎస్‌లో నలుగురి కోసం కొట్లాడుకుంటున్నారని, బీఆర్‌ఎస్‌ను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అప్పజెబుతున్నట్లు కేసీఆర్ ప్రకటిస్తే కాంగ్రెస్ అధికారం ఒక్క క్షణంలో నేలకూలుతుందని అన్నారు. బడుగు బలహీన వర్గాల సమానత్వ సాధనకు సాగిస్తున్న సమరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగం కుమారస్వామి, నాయకులు లక్ష్మీకాంత్, బింగి రాము యాదవ్, పెబ్బేటి నిరంజన్, కుందేళ్ల శంకర్ యాదవ్, సతీశ్ యాదవ్, కార్తీక్ ఏకలవ్య, బండాలయ్య, బీచుపల్లి యాదవ్, రమేశ్‌గౌడ్, దయానంద, బలరాం, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

మానవపాడు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన మండలకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. 108 హైవే అంబులెన్స్ సిబ్బంది, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మానవపాడు మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన వ్యక్తు లు ఎదురురెదురుగా బైక్‌పై వెళ్తూ ఢీకొట్టుకున్నారు. ఘటనలో తాతమనవళ్లు పెద్దమద్దిలే టి, పవన్‌కుమార్ తీవ్ర గాయాలయ్యాయి. వీరి ని 108 ఈఎంటీ రేణుక ఆధ్వర్యంలో క్షతగాత్రు లకు చికిత్స అందించారు. అనంతరం వారిని కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వసతి గృహంలో స్వచ్ఛ భారత్



ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం సాయంత్రం విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, పిచ్చి మొక్కలు తొలగించారు. అలాగే కిచెన్ గార్డెన్‌లో మొక్కలకు నీళ్లు పారించేందుకు ప్రత్యేకంగా కాల్వలు ఏర్పాటు చేశారు. ఆకు కూరల తోట చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నర్సింహులు, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలకు ఏర్పాట్లు పూర్తి



ధరూరు: స్థానిక ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఈ నెల 15న నిర్వహించే ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ రవీంద్ర బాబు, డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలను ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ జిరాక్స్ తీసుకొని పీడీ శ్రీనివాసులును 9.30 గంటల లోపు కలిసి రిపోర్ట్ చేసుకోవాలన్నారు.

‘రక్తదానం చేసి ప్రాణదాతలు కండి’

శాంతినగర్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ అన్నారు. ఈ నెల 17న ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసే విషయమై ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సేవా స్ఫూర్తి, ప్రజాహిత దృక్పథానికి గుర్తుగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, మానవతా దృక్పథంతో యువకులందరూ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, గవ్వల శ్రీనివాసులు, సంజీవరెడ్డి, పైపాడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



నాటిక రూపంలో ప్రదర్శన వివరిస్తున్న విద్యార్థులు

గద్వాల టౌన్: జాతీయ హిందీ దివస్‌ను పురస్కరించుకుని జిల్లాలోని కేజీబీవీ విద్యా సంస్థలతో ఆదివారం ‘హిందీ మేళా ప్రదర్శన’ నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు హిందీకి సంబంధించిన ఏకపాత్రాభినయం, ఉపన్యాసం, నాటకం, పాటలు, కవి వేషధారణలతో పాటు బోధన ఉపకరణాలతో ప్రదర్శన నిర్వహించారు. గద్వాల కేజీబీవీలో విద్యార్థులు చక్కని ప్రదర్శన ఇచ్చారు. నూతన హిందీ ఆవిష్కరణలను అభివృద్ధి చేస్తున్న తీరును విద్యార్థులు కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం క్విజ్ పోటీల్లో అదరగొట్టారు. ప్రదర్శనలను ఆయా పాఠశాలల ఎస్‌ఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. ఈ సందర్భంగా గద్వాల కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన హిందీ దివస్ వేడుకలకు విద్యాధికారి హంపయ్య హాజరయ్యారు. విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కార్యక్రమంలో రేణుక, ఆంజనేయులు, హిందీ ఉపాధ్యాయురాలు ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకరిస్తేనే ఉత్తమ ఫలితాలు



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వార్డెన్ నర్సింహులు

ధరూరు: మీరు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, మీ కష్టం.. వారి చదువు వృథా కాకూడదు అంటే కొన్ని రోజులు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తే పదో తరగతిలో మెరుగైన ఫలితాలు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందని ధరూరు బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ నర్సింహులు అన్నారు. ఆదివారం ఉదయం ఆయన హాస్టల్ విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుకు సంబంధించిన పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు ఈ కొన్ని రోజులు అత్యంత ప్రాముఖ్యమైన రోజులని, వారికి ప్రశాంతంగా చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఇంటి వద్ద జరిగే చిన్న చిన్న కార్యక్రమాలకు పిల్లలను ఇంటికి తీసుకెళ్లి చదువుకు ఆటంకం కలిగించొద్దని కోరారు. దసరా సెలవుల్లోనూ ఇంటి వద్ద ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చదువు ప్రాముఖ్యతను గురించి, చదువుకుంటే సమాజంలో గౌరవ మర్యాదలు దక్కుతాయని వివరించారు. తాను ఇదే హాస్టల్‌లో చదువుకొని ఈ స్థాయికి వచ్చానన్నారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

గుంతల రోడ్లకు మరమ్మతు చేపట్టండి



పెద్దపోతులపాడు రోడ్డు గుంతలను చూపుతున్న నాయకులు

మానవపాడు: గుంతల రోడ్లకు మరమ్మతు చేపట్టాలని మండలంలోని మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలకు చెందిన నాయకులు గొల్ల వెంకట్రాముడు, శాంతన్న, లియా, యేసన్న తదితరులు రోడ్డుపై బైఠాయించారు. ఈ రహదారులపై గుంతల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. నిత్యం రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నారన్నారు. రాత్రి సమయంలో రోడ్ల గుండా ప్రయాణించాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నామని వాహనాదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగించాలి



మాట్లాడుతున్న జిల్లా నాయకులు

ఉండవెల్లి: సీఐటీయూ మండల మూడవ మహాసభలను ఆదివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు, కార్యదర్శులు వెంకటస్వామి, నరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడుల పేరుతో బోర్డును నిర్వీర్యం చేయడంతో చట్టాన్ని యథావిధిగా ఐక్యంగా చేయడంతో కామ్రేడ్స్ చట్టాన్ని కొనసాగించేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దిలేటి, తెలంగాణ రైతు సంఘం నాయకులు ఈదన్న, లాయర్ల సంఘం నాయకులు లక్ష్మణ, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, ఖదీర్, గోపి, కృష్ణ, మదు, వేణు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వీధులన్నీ చీకట్లోనే..

- గ్రామాల్లో వెలగని వీధి దీపాలు



కేటీదొడ్డిలో వెలగని వీధి దీపం

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాత్రిపూట బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయినప్పటి నుంచి గ్రామాల్లో సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులపై గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా రహదారులపై పాములు, తేళ్లు సంచరిస్తాయని, చీకట్లో అనుకోకుండా తగిలితే అవి కాటువేసే ప్ర మాదం ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అడిగితే నిధులు లేవని సమాధానం ఇస్తున్నారని అసంతృప్తి చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సెగ్రిగేషన్ షెడ్ ఉన్నా.. చెత్త బయటికే

అమరచింత: పట్టణంలో ఇంటింటి నుంచి తరలిస్తున్న తడి, పొడిచెత్తను సెగ్రిగేషన్‌షెడ్‌లో వేయకుండా షెడ్ బయట చెత్త చెదారం వేస్తుండటంతో పరిసరాలు దుర్గంధంగా తయారైంది. సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను తడి, పొడిగా వాటిని వేరు చేయడానికి రూ.25లక్షలతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌ను నిరుపయోగంగా వదిలేశారు. ఇప్పటివరకు తడి, పొడి చెత్తను వేరు చేయకుండా సేకరించిన చెత్తను వాటి బయటే వేస్తూ తగల బెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రచయితకు ఘన సన్మానం

శాంతినగర్: నవ్వులే నవ్వులు జోక్స్ రచయితకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అభిమానులు ఆదివారం ఘనంగా సన్మానించారు. శాంతినగర్‌లో నివాసం ఉంటూ కొంకల పాఠశాల, కలెక్టర్ కార్యాలయం, మానవపాడు ఎంపీడీఓ కార్యాలయాల్లో విధులు నిర్వహించిన షేక్ అస్లాం షరీఫ్ తనదైన శైలిలో జోక్స్ రచనలు చేస్తూ అందరిని నవ్వించే ప్రయత్నం చేస్తున్నాడు. జోన్ సమీపంలో జాతీయ రహదారి సమీపంలో ఉన్న శ్రీకాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమానికి వెళ్లిన ఆయనను ఆశ్రమం నిర్వాహకులు, అభిమానులు శాలువా వేసి సన్మానించారు.

